క్లుప్తంగా

కొల్లాకు లైఫ్ సేవియర్ అవార్డు



పెనమలూరు: రక్తదాన కార్యక్రమాల ద్వారా తలసేమియా చిన్నారులను ఆదుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారికి విద్యార్థులను ప్రోత్సహించి రక్తం అందేలా చేస్తున్న కానూరు సిద్దార్ధ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్రకు న్యూ సిటీ బ్లడ్ బ్యాంకు లైఫ్ సేవియర్ అవార్డు అందించింది. విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కొల్లా నరేంద్ర ఈ అవార్డును సివిల్ జడ్జి వివి.శ్రీనివాసమూర్తి చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చని పేర్కొన్నారు.

ప్రమాద భరితంగా 100 అడుగుల రోడ్డు



పెనమలూరు: నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే కానూరు 100 అడుగుల రోడ్డు ప్రమాదకరంగా మారింది. వివరాల్లోకి వెళితే కానూరు వందడుగుల రోడ్డులో గ్యాస్ పైప్‌లైన్ కోసం భారీగా తవ్వకాలు చేశారు. రోడ్డు ఒక పక్క దాదాపు కిలోమీటరు మేర గోతులు తవ్వి మట్టిని రోడ్డుపై వేశారు. గోతులు పూడ్చకుండా, పని ముగించకుండా వదిలేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం దినదినగండంగా మారింది. రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న మట్టి, గోతులు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టి గుట్టలు తొలగించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గాయనీ గాయకుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి



విజయవాడకల్చరల్: గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సామాజికవేత్త మీరాకుమార్ తెలిపారు. రాగలహరి సంగీత, సాహిత్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం సినీ సంగీత విభావరి, గాయకుడు అయ్యప్ప సాయి కృష్ణకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మీరాకుమార్ మాట్లాడుతూ కొందరు గాయనీ గాయకుల్లో ప్రతిభ అంతర్లీనంగా ఉంటుందని, వారికి వేదిక కల్పించి ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ.. యువ గాయకుడు అయ్యప్ప సాయికృష్ణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనలను ఇచ్చారన్నారు. గాయని మల్లాది స్వాతి, పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు అయ్యప్ప సంగీత సేవలను వివరించారు. మల్లాది స్వాతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సూర్య కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ ఆలీ, రూపశ్రీ, నాయక్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శారదా కళాసమితి ఆధ్వర్యంలో వసంత రుతోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రంగస్థల నటుడు ఏపీ విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ కేఎస్ పరబ్రహ్మం ఆత్మీయ సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ కళాకారుల ప్రతిభకు ఎల్లలు లేవన్నారు. శారదా కళాసమితి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు డాక్టర్ కేఎస్ పరబ్రహ్మం రంగస్థల సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్, నీలం దుర్గారావు ప్రసంగించారు. నిర్వాహకులు పరబ్రహ్మం దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమాలు శారదా కళాసమితి కన్వీనర్ ఎంఆర్ఎస్ ప్రకాశరావు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఘంటసాల పవన్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. డాక్టర్ పరబ్రహ్మం దుర్యోధనుని ఏకపాత్రను ప్రదర్శించారు.

ఖరీఫ్‌కు ‘సాగు’దాం

- 1,72,435 హెక్టార్లలో పంటల సాగుకు సమాయత్తం
- భూమి సారవంతం కోసం పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం
- క్వింటాకు రూ. 500 సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీ
- ప్రతి ఆర్బీకేలో 20 టన్నుల ఎరువులు ఉండేలా చర్యలు
- ఖరీఫ్ ప్రణాళిక విడుదల చేసిన జిల్లా వ్యవసాయశాఖ



ట్రాక్టర్‌తో పొలం సిద్ధం చేస్తున్న రైతులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇందు కోసం వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 1,72,435 హెక్టార్లలో వివిధ వ్యవసాయ పంటలు సాగు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. 1,65,789 హెక్టార్లలో వరి, 1,135 హెక్టార్లలో మినుము, 112 హెక్టార్లలో మొక్కజొన్న, 4,310 హెక్టార్లలో చెరకు, 765 హెక్టార్లలో వేరుశనగ, 300 హెక్టార్లలో పత్తి, 24 హెక్టార్లలో కంది, పెసర, ఉలవలు తదితర పంటలు సాగవుతాయని అధికారులు ప్రణాళికలో పేర్కొన్నారు.

ఆర్బీకేల్లో విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు వ్యవసాయశాఖ అధికారులు ప్రతి రైతుభరోసా కేంద్రం వద్ద సిద్ధంగా ఉంచారు. క్వింటాకు రూ.500 సబ్సిడీతో వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, బీపీటీ 5204, ఎంటీయూ 1224 వరి విత్తనాలను అందుబాటులో ఉంచారు. 6,691 క్వింటాళ్లు ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధం చేశారు. దీంతో పాటు రైతులు వారు సాగు చేసే పంటలను బట్టి భూములను సారవంతం చేసుకునేందుకు ఉపయోగపడే పచ్చిరొట్ట పైరు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలుగ విత్తనాలు 2,864 క్వింటాళ్లు, పెసర 579 క్వింటాళ్లు, పిల్లిపెసర 966 క్వింటాళ్లు 50 శాతం సబ్సిడీతో అందించనున్నారు. ఈ విత్తనాల కోసం రైతులు తమ పొలం పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డు తీసుకుని ఆర్బీకేల్లో సంప్రదించాలని వ్యవసాయశాఖాధికారులు సూచించారు.



రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్ సాగుకు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల్లో పొందాలి. పంటలు సాగు చేసుకునేందుకు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపిన విధంగా తమ పొలంలో నేల స్వభావాన్ని బట్టి విత్తనాలు వినియోగించుకుని అధికంగా పంట దిగుబడి సాధించాలి.

– ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ప్రతి ఆర్బీకేలో పుష్కలంగా ఎరువులు

రైతులకు అవసరమైన విత్తనాలతో పాటు ఎరువులను వ్యవసాయశాఖాధికారులు సిద్ధం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను తయారీదారుల నుంచి ప్రణాళిక ప్రకారం తీసుకొచ్చి అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. గత సంవత్సరానికి సంబంధించి మిగిలిన స్టాక్ 34,326 టన్నులతో పాటు ఏప్రిల్, మే నెలలో వచ్చిన 13,472 టన్నులు స్టాక్‌తో కలిపి ప్రతి ఆర్బీకే వద్ద 20 టన్నుల చొప్పున ఎరువులు ఉండేలా వ్యవసాయశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను ప్రణాళిక ప్రకారం సిద్ధం చేసి రైతులు సకాలంలో సాగు చేసేలా చర్యలు తీసుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే రైతులు సాగుకు సన్నద్ధమవుతుంటే వ్యవసాయాధికారులు విడుదల చేసిన ఖరీఫ్ ప్రణాళిక వారికి మరింత ఊరటనిచ్చింది.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాలస్వామి, శ్రీఆంజనేయస్వామివార్ల దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు విష్వక్సేన పూజ, స్వామివారిని పెళ్లి కుమారుడిని చేయడం, అనంతరం తులసి అర్చన ఉంటుంది. 23న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు నిత్యహోమం, సాయంత్రం ఆరు గంటలకు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారికి దివ్య కల్యాణ మహోత్సవం జరుగును. 24న గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి పూజ జరుగును. సాయంత్రం ఆరు గంటలకు గుడి చుట్టూ ప్రదిక్షణలు, పవళింపుసేవ, ప్రసాద వితరణ ఉంటుంది. భక్తులు కల్యాణ మహోత్సవానికి వచ్చి స్వామివారి కల్యాణం కనుల పండుగగా తిలకించాలని ఈఓ కోరారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. ఈ శిబిరంలో సోమవారం విద్యార్థులతో కథలు చదివించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి డి.బాబురావు మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందని చెప్పారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పి.దుర్గాలక్ష్మి, రామచంద్రరాజు, కంభంపాటి ధర్మారావు, రమణ పాల్గొన్నారు.

కంకిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. శిబిరంలో సోమవారం చిన్నారులకు భగవద్గీత పఠనం, చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి సునీత శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు ఆట పాటలతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడుపుతున్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు కుర్చీలాట, కథల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. కుర్చీలాటతో సందడి చేశారు. పోటీలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: విద్యార్థుల్లోని సృజనను వెలికి తీసేందుకు ఆటల పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం తెలిపారు. గ్రంథాలయాల్లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక విద్యార్థులకు సోమవారం క్యారమ్స్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. విజేతలను గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించడం వంటి పోటీలు నిర్వహించారు. పుస్తకాలు చదవడం వల్ల వారిలో మేథో వికాసం జరుగుతుందని చెప్పారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, నవభారత్ హైస్కూల్, సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థులు పాల్గొనగా పాఠకులు, గ్రామపెద్దలు విజేతలను అభినందించారు.



గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిన్నారులు



పురుషోత్తపట్నంలో క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆలయ భూముల బహిరంగ కౌలు వేలం

పెనమలూరు: దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాలకు చెందిన భూముల బహిరంగ కౌలు వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు కార్యనిర్వహణాధికారి గ్రేడ్–1 యువీ ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో వేంచేసిన శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానంకు చోడవరం గ్రామంలో గల 9.27 ఎకరాల భూమికి, పెనమలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన 9.46 ఎకరాల భూమికి 2024–25 నుంచి 2026–27 సంవత్సరాలకు బహిరంగ కౌలువేలం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు పెనమలూరు గ్రామంలోనూ, మధ్యాహ్నం మూడు గంటలకు చోడవరం గ్రామంలోనూ ఆలయ ప్రాంగణాల్లో కౌలు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలోని శ్రీ పర్వతనేని ధర్మచెరువుకు చెందిన 20.73 ఎకరాల చెరువు కౌలు హక్కులకు ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు ఈడుపుగల్లు గ్రామంలోని శ్రీ కామేశ్వర వీరభద్రస్వామి ఆలయంలో కౌలువేలం జరుగుతుందన్నారు. పాటదారులు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9885359797 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెట్రోల్ విడిగా బాటిల్స్‌లో విక్రయించరాదు

పెనమలూరు: వాహనాల్లో మాత్రమే పెట్రోల్ విక్రయించాలని బాటిల్స్, విడిగా విక్రయాలు చేయకూడదని మండలంలోని 11 పెట్రోల్ బంకులకు పెనమలూరు సీఐ టీవీవీ రామారావు సోమవారం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అసాంఘిక శక్తులు పెట్రోల్ బంకుల్లో విడి పెట్రోలు సీసాల్లో తీసుకెళ్లి దాడులు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘించి లూజు విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులు సంచరిస్తే గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం సెక్షన్‌లోని ఇస్లాంపేట, కొత్తపేట, పాతగన్నవరం, చెంచులకాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, ఆశ్రమం, హోటల్ పార్క్ ఎలైట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా ఉన్న 16 ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ జీలుగ 210, జనుము 10, పిల్లిపెసర 45 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము రూ. 44, పిల్లిపెసర రూ. 67లకు అందజేస్తారని వివరించారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

సూరంపల్లిలో ఆరుగురు జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని సూరంపల్లిలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ శివప్రసాద్ నేతృత్వంలోని సిబ్బంది పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 25,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూదరులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు.

సుత్రా సమ్మర్ స్పెషల్ వస్త్రాల అమ్మకాలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): సూత్రా ఆధ్వర్యంలో విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ ఉమేష్ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ మంగళవారం కూడా కొనసాగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో అనేకమైన డిజైన్‌లు విక్రయిస్తున్నామని చెప్పారు. ఫ్యాషన్ దుస్తులు, జ్యూయలర్స్, హోమ్ ఫర్నిచర్‌తో పాటు మరెన్నో డిజైనర్ ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ జయసూర్య



తేలప్రోలులో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

ఉంగుటూరు: రాజకీయ ప్రలోభాలకులోనై ఎవరైనా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు తేలప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పోలీసులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని ప్రజలందరు సహకరించాలని అన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున హైస్కూల్ వద్ద జరిగిన ఘర్షణపై ఇప్పటికే 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. క్షణికావేశానికిలోనై ఘర్షణ పడటం వల్ల వారిపై కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొల్లనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన



గొల్లనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న లింక్ వర్కర్లు

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థల సహకారంతో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సదాలక్ష్మి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ మృతుల స్మారక దినోత్సవం నిర్వహిస్తూ ఈ కొవ్వొత్తుల ప్రదర్శన చేసినట్లు ఆమె తెలిపారు. ఎయిడ్స్‌ను నివారించేందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. లింక్ వర్కర్ కరుణ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ నగర్‌లో కార్డన్ సెర్చ్



మహాత్మాగాంధీ నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ నవీన్ నరసింహామూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లో హనుమాన్‌జంక్షన్ పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి నేతృత్వంలో ఎస్ఐలు ఏడీఎల్ జనార్ధన్, ఎం.చిరంజీవి, పైడిబాబు, ఆర్జమ్మతో పాటుగా 54 మంది సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు మద్యం బాటిళ్లు, 13 బైకులు, మారుతీ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాల రికార్డుల పరిశీలన నిమిత్తం వాటిని హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, నేరాలను అదుపు చేసేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

మర్లవాగులో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



వాగులో వ్యర్థాలను తొలగిస్తున్న జేసీబీ

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న పామర్తినగర్‌లో మర్లవాగు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులో నీటి ప్రవాహం పెరిగింది. దీనికితోడు వాగులో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో స్పందించిన పామర్తినగర్ కాలనీవాసుడు గొంతెన రాజ్‌కుమార్ వ్యర్థాల తొలగింపునకు ముందుకువచ్చాడు. జేసీబీ మిషన్‌ను ఏర్పాటు చేసి వాగులో దట్టంగా పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సోమవారం తొలగించారు. ఈ వ్యర్థాలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా సిబ్బంది బయటకు తరలించారు. నీటి ప్రవాహం సక్రమంగా జరిగేందుకు మర్లవాగును పూర్తిస్థాయిలో ప్రక్షాళన దిశగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నున్నలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం

- రూ. 2.10 కోట్లు కేటాయింపు
- ప్రారంభమైన మొదటిదశ నిర్మాణ పనులు



నున్నలో ప్రారంభమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణానికి రూ. 2.10 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం నున్న గ్రామంలోని టీచర్స్ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం మొదటి దశ పనులు జరుగుతున్నాయి. ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని ప్రజానీకానికి ప్రభుత్వ వైద్యసేవలు నున్న గ్రామంలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఎన్నో ఏళ్లగా విజయవాడ రూరల్ మండలానికి చెందిన ప్రజానీకం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని కోరుతున్నా, గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రత్యేక దృష్టితో నున్న గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది.

ఇప్పటికే వైద్య సిబ్బంది నియామకం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇప్పటికే ప్రభుత్వం ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించింది. వారితో పాటు మల్టీపర్పస్ హెల్త్ ఆఫీసర్, హెల్త్ విజిటర్ పోస్టులను మంజూరు చేయగా వారు వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్స్(డాక్టర్లు)కు ఒక గది, ఆయూష్ గది, వ్యాక్సిన్ల గది, ఆపరేషన్ థియేటర్, స్త్రీలకు, పురుషులకు వైద్యం కోసం రెండు గదులు, కాన్పుల గది, స్టేరలైజేషన్ గది, లేబరేటరీ గది, స్టాఫ్ నర్సులకు(ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉంటారు) గది, ఫార్మసిస్ట్(మందులకు)గది, యూడీసీకి ఒక గది నిర్మించే విధంగా వైద్య ఆరోగ్యశాఖ డిజైన్ చేసింది. సాధారణ వ్యాధులకు వైద్య చికిత్సలు, మహిళలకు ప్రసవాలు, అంటువ్యాధుల నివారణకు చికిత్సలు, కుటుంబ నియంత్రణ, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్స్ కార్యక్రమాలు ఇంకా ప్రభుత్వం సూచించిన పలు వైద్యసేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళల స్వయం ఉపాధికి రోటరీ విజయవాడ శ్రీదుర్గా క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ జరిగింది. స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ జిల్లా 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు చేతుల మీదుగా ఆదివారం రాత్రి మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. శ్రీదుర్గా క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. సభ్యులకు కొన్ని సలహాలు, సూచనలు అందించారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమానికి 10 ట్రంక్ పెట్టెలు, పేద విద్యార్థికి సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ గోలి రవీంద్ర, జిల్లా కార్యదర్శి భాస్కర్ మలపాక, పీడీజీ జీవీ రామారావు, క్లబ్ అధ్యక్షుడు కే విక్రమ్ రెడ్డి, కార్యదర్శి టి.నాగేశ్వరరావు, సభ్యులు పవన్‌కుమార్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.